

డుంబ్రిగుడలో పవన్‌కల్యాణ్ సభకు ఏర్పాట్లు

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం



అనకాపల్లి మెయిన్‌రోడ్డులోని చినబజార్ సీతారాముల ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం

శ్రీరామ నవమిని పురస్కరించుకొని వాడవాడలా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక వేదికలపై సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ఉంచి వివాహ వేడకను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిపారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు ఆయా ఆలయాల్లో సీతమ్మవారు, రాములవారికి పట్టువస్త్రాలు సమర్పించి, కల్యాణోత్సవంలో పాలుపంచుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.



నర్సీపట్నం గచ్చపువీధి రామాలయంలో సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు

నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక

అల్లూరి జిల్లా ఏజెన్సీలో రెండు రోజులపాటు పర్యటన

- తొలి రోజు డుంబ్రిగుడ మండలం పెదపాడు సందర్శన, గిరిజనులతో ముఖాముఖి
- సాయంత్రం మండల కేంద్రంలో సభ, 200 రోడ్ల నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన
- రేపు అరకులోయ మండలం సుంకరమెట్టలో చెక్కవంతెన ప్రారంభం



పాడేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్య మంత్రి కె.పవన్‌కల్యాణ్ ఏజెన్సీలోని డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో రెండు రోజులపాటు పర్య టించనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు విశాఖ నుంచి పెందుర్తి, అనంతగిరి, అరకులోయ మీదుగా రోడ్డు మార్గంలో డుంబ్రిగుడ చేరుకుంటారు. చాపరాయి జలవిహారిలో మత్స్యాలమ్మను సందర్శిస్తారు. అనంతరం చాపరాయి గెడ్డ మీదుగా పెదపాడు పీవీటీజీ గ్రామానికి చేరుకుంటారు. పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలను పరిశీలిస్తారు. గిరిజనులతో ముఖాముఖి నిర్వహించి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. తరువాత డుంబ్రిగుడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చేరుకుంటారు. ఇక్కడ ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు 200 రోడ్ల నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేస్తారు. రాత్రికి అరకులోయ చేరుకుని ఏపీటీడీసీ అతిథిగృహంలో బసచేస్తారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అరకులోయ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి ఇదే మండలం సుంకరమెట్ట సమీపంలోని కాఫీ తోటలకు చేరుకుంటారు. అటవీశాఖ చెక్కలతో నిర్మించిన కాలిబాట వంతెనను ప్రారంభిస్తారు. అనంతరం విశాఖపట్నం పయనమవుతారు. డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఎస్పీ అమిత్ బర్ధార్ పర్యవేక్షిస్తున్నారు. కాగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో సోమవారం చాపరాయి జల విహారిలో పర్యాటకుల ప్రవేశాన్ని రద్దు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

నువ్వులో కొత్త వంగడం

'వైఎల్ఎం 146' పేరుతో అభివృద్ధి చేసిన ఎలమంచిలి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు

- ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడి
- వచ్చే రబీ సీజన్‌లో రైతులకు అందుబాటులోకి విత్తనం



ఎలమంచిలి పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా సాగులో వున్న 'వైఎల్ఎం 146' రకం నువ్వు పంట

అనకాపల్లి అగ్రికల్చర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలోని (కొక్కిరాపల్లి) వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు కొత్త నువ్వు వంగడం 'వైఎల్ఎం 146'ను రూపొందించారు. ఇది 'వైఎల్ఎం 66' రకం కన్నా అధిక దిగుబడి ఇస్తుంది. కేంద్ర విత్తన ఎంపిక కమిటీ ఈ వంగడం విడుదలకు ఆమోదం తెలిపింది. ఈ వంగడంపై గత ఏడాది నుంచి పలు పరిశోధనలు జరిపిన సేద్య శాస్త్రవేత్తలు.. దీనిని ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం అధిక విస్తీర్ణంలో సాగులో ఉన్న 'వైఎల్ఎం 66' నువ్వు పంట ఎకరాలకు రెండు, మూడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి ఇస్తున్నది. 'వైఎల్ఎం 146' రకం ఐదారు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తల ప్రయోగాత్మక సాగులో నిర్ధారణ అయ్యింది. విత్తిన 80 నుంచి 85 రోజుల్లో పంట కోతకొస్తుంది. విత్తనం లేత గోధుమ రంగులో ఉండి నూనె 49 శాతం వస్తుంది. బూడిద తెగులు, ఆకుమచ్చ తెగులును కొంతవరకు తట్టుకొంటుంది. జనవరి లేదా మే నెలల్లో విత్తుకోవడానికి ఇది అత్యంత అనుకూలమని శాస్త్రవేత్త శిరీష తెలిపారు. 'వైఎల్ఎం 146' రకం నువ్వు విత్తనాన్ని త్వరలో అధికారికంగా విడుదల చేయనున్నారు. వచ్చే సీజన్ నాటికి రైతులకు అందుబాటులోకి వస్తుందని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రమణ మూర్తి తెలిపారు.

అనకాపల్లి ఏఎంసీ పీఠం ఎవరికో!?

టీడీపీ, జనసేనల నుంచి పలువురు ఆశావహులు

- ఎవరికి వారు లెక్కలు వేసుకుంటున్న నేతలు
- మూడో విడత ఏఎంసీ పదవుల భర్తీలో 'అనకాపల్లి'కి చోటు ఉంటుందని అంచనా



అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో రెండో అతి పెద్ద బెల్లం మార్కెట్‌గా గుర్తింపు పొందిన అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం కోసం కూటమి నాయకులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం రెండు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 90 వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్/ చైర్‌పర్సన్‌లను నియమించింది. జిల్లాలో ఆరు వ్యవసాయ మార్కెట్ యార్డులు వుండగా, తొలివిడతలో నర్సీపట్నం, ఎలమంచిలి, మలి విడతలో పాయకరావుపేట మార్కెట్ కమిటీలకు చైర్మన్/ చైర్‌పర్సన్‌లను నియమించిన విషయం తెలిసిందే. అయితే దురదృష్టవశాత్తూ నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన రుత్తల శేషుకుమార్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మరుసటి రోజే మృతిచెందారు. దీంతో నర్సీపట్నంతోపాటు జిల్లాలో మిగిలిన మూడు.. అనకాపల్లి, చోడవరం, మాడుగుల ఏఎంసీలకు చైర్‌పర్సన్‌లను, మొత్తం ఆరింటికి పాలకవర్గ సభ్యులను నియమించాల్సి వుంది. నర్సీపట్నం, చోడవరం, మాడుగులలో టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండగా, అనకాపల్లిలో జనసేన ఎమ్మెల్యే వున్నారు. గతంలో చైర్మన్లను ప్రకటించిన మూడు ఏఎంసీల్లో రెండు టీడీపీ, ఒకటి జనసేనకు కేటాయించారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంబంధిత పార్టీల ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏఎంసీ పాలకవర్గాలు భర్తీ చేయాల్సిన అనకాపల్లిలో జనసేన, మిగిలినచోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు వున్నారు. ఆయా ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వారినే ఏఎంసీ చైర్మన్లుగా ప్రభుత్వం నియమిస్తున్నది. మిగిలిన ఏఎంసీలకు కూడా అతి త్వరలోనే పాలకవర్గాలను నియమించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అనకాపల్లి చైర్మన్ పదవి రేసులు పలువురు ఆశావహులు వున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి కశికోట మండలానికి చెందిన ఉగ్గిన రమణమూర్తి, కాయల మురళి, గొంతిన శ్రీనివాసరావు, అనకాపల్లి నుంచి తలారి లక్ష్మీప్రసాద్, రమణ(కొండుపాలెం), జనసేన పార్టీ నుంచి చదరం నాగేశ్వరరావు, కె.సత్యనారాయణ ఏఎంసీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నట్టు తెలిసింది. టీడీపీకి చెందిన పీలా గోవింద, మళ్ల సురేంద్ర రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులకు చైర్మన్లుగా వున్నారు. జనసేనకు చెందిన పీలా నాగశ్రీను ప్రసిద్ధ నూకాంబిక అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఏఎంసీ చైర్మన్ పదవిని తమకే కేటాయించాలని రెండు పార్టీల నేతలు ఎవరి లెక్కలు వారు చెబుతున్నారు. కాగా బీజేపీకి చెందిన సీఎం రమేశ్ అనకాపల్లి ఎంపీగా వున్నారని, అందువల్ల ఒక్క నామినేటెడ్ పదవి అయినా తమకు తమకు కేటాయించాలని ఆ పార్టీ నేతలు కోరుతున్నట్టు తెలిసింది.



స్వామివారి కల్యాణోత్సవానికి సిద్ధం చేస్తున్న వేదిక

నేటి నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

వారం రోజుల పాటు నిర్వహణ

- రేపు రాత్రి 10.30 గంటలకు కల్యాణం
- దర్శన వేళల్లో స్వల్ప మార్పులు

సింహాచలం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై వరాహలక్ష్మీనృసింహ స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. వారం రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు వేకువజామున నాలుగు గంటల నుంచి సాయంత్రం వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. 8వ తేదీ ఆ రోజు ఉదయం ఉత్తర రాజగోపురానికి సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో విశేష హోమాలు నిర్వహిస్తారు. తరువాత కొట్నాల ఉత్సవం, ఆరాధన, విశేష హోమాలు, ధ్వజారోహణం, తిరువీధి, ఎదురు సన్నాహోత్సవం వంటివి నిర్వహిస్తారు. రాత్రి 7.30 తరువాత స్వామివారిని రథంపై ఉంచి అలంకరణ మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటుచేసిన పుష్ప వేదికపై 10.30 గంటల నుంచి స్వామివారికి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. 10వ తేదీ సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలుడిగా అలంకరించి మాడవీధుల్లో ఊరేగిస్తారు. 11వ తేదీ సాయంత్రం సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో తిరువీధి నిర్వహిస్తారు. 12వ తేదీన చూర్ణోత్సవం, వసంతోత్సవం, తిరువీధి, చక్రస్నానం, మృగయోత్సవం, అశ్వవాహనంపై తిరువీధి, ధ్వజారోహణం జరుగుతాయి. 13వ తేదీ ఉదయం వినోదోత్సవం (ఉంగరపు సేవ)తో స్వామి వారి వార్షిక తిరు ... మిగతా 6వ పేజీలో

నర్సీపట్నంలో ఆయుష్మాన్ ఆస్పత్రి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా రేపు ప్రారంభం

- గత టీడీపీ హయాంలోనే రూ.20 లక్షలతో భవన నిర్మాణం
- ప్రారంభించే సమయానికి మారిన ప్రభుత్వం
- ఐదేళ్లపాటు అందుబాటులోకి తీసుకురాని వైసీపీ పాలకులు
- కూటమి అధికారంలోకి రావడంతో కదలిక
- మరమ్మతులకు రూ.12 లక్షలు మంజూరు చేయించిన స్పీకర్



ఏరియా ఆస్పత్రి ఆవరణలో ప్రారంభానికి సిద్ధంగా వున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం

నర్సీపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):

స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆస్పత్రిని స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఆయుష్ విభాగం నేచురోపతి ఆస్పత్రి కోసం స్థలం కేటాయించారు. కొంత భాగంలో యోగా సెంటర్, ఖాళీ స్థలంలో వాకింగ్ ట్రాక్, రోగులు సేద తీరడానికి బెంచీలు వేసి చిన్నపార్కుగా అభివృద్ధి చేయాలని ప్రణాళిక చేశారు. 2017లో శంకుస్థాపన చేసి రూ.20 లక్షలతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. 2019లో సాధారణ ఎన్నికలనాటికి భవన నిర్మాణం పూర్తి చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఈ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురాలేదు. ఐదేళ్లపాటు భవనాన్ని నిరుపయోగంగా వుంచేశారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయిన చింతకాయల అయ్యన్నపాత్రుడు.. ఆయుష్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రత్యేక దృష్టి పెట్టారు. భవనం మరమ్మతులకు కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షలు, జిల్లా కలెక్టర్ రూ.9 లక్షలు మంజూరు చేశారు. భవనానికి రంగులు వేసి, విద్యుత్తు, ఫ్లోరింగ్ టైల్స్ వేసి, గేటు, తలుపులు అమర్చారు. ఆ ఆస్పత్రికి మెడికల్ ఆఫీసర్ పోస్టు సైతం మంజూరైంది. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోద రెండు నెలల నుంచి ఏరియా ఆస్పత్రి ఓపీ విభాగం కొత్త భవనంలోని ఒక గదిలో వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఆయుర్వేద ఆస్పత్రి)ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రసాయన విషవాయులు పీల్చి హెల్పర్ మృతి

రాంకీ సీఈటీపీలో ఘటన

- మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ప్రకటించిన యాజమాన్యం



చీపురుపల్లి అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

పరవాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఫార్మా వ్యర్థ రసాయనాలు పీల్చడంతో హెల్పర్ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. పరవాడలోని విశాఖ ఫార్మాసిటీలో రాంకీ యాజమాన్యానికి చెందిన కామన్ ఎఫ్లూయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)లో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఇందుకు స్థానిక సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.



అప్పలనాయుడు రసాయన వ్యర్థాల నమూనాలను సేకరించిన సంపు ఇదే

తానాం గ్రామానికి చెందిన చీపురుపల్లి అప్పలనాయుడు(44) రాంకీ సీఈటీపీలో ల్యాబ్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఫార్మా పరిశ్రమల రసాయన వ్యర్థాలను ఈ ప్లాంట్‌లో శుద్ధి చేస్తుంటారు. రోజూ రసాయన వ్యర్థాల నమూనాలను సేకరిస్తుంటారు. శనివారం రాత్రి విధుల్లో వున్న అప్పలనాయుడు 11 గంటల సమయంలో సీఈటీపీ మ్యాన్‌హోల్ వద్ద (సంపు) నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తీసుకెళుతున్న ... మిగతా 6వ పేజీలో

చురుగ్గా రోడ్డు నిర్మాణం

శృంగవరం-గన్నవరంమెట్ట మధ్య సగానికిపైగా పనులు పూర్తి

- మన్యపురట్ల సెంటర్ సమీపంలో సీసీ రోడ్డు
- మిగిలిన చోట్ల బీటీ మొదటి లేయర్
- త్వరలో కల్వర్టులు, వంతెనలతోపాటు తారు రోడ్డు రెండో లేయర్ పనులు



ఎ.శరభవరం వద్ద ఒక లేయర్ పూర్తయిన తారురోడ్డు



మన్యపురట్ల సెంటర్ సమీపంలో వేసిన సీసీ రోడ్డు

నాతవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని తుని-నర్సీపట్నం మార్గంలో శృంగవరం-గన్నవరంమెట్ట మధ్య రహదారి అభివృద్ధి పనులు సగానికిపైగా పూర్తయ్యాయి. మన్యపురట్ల సెంటర్ సమీపంలో సీసీ రోడ్డుతోపాటు మిగిలిన చోట్ల తారు రోడ్డులో ఒక లేయర్ వేయడం పూర్తయ్యింది. ఇంకా వంతెనలు, కల్వర్టులు, బీటీ చివరి లేయర్‌పనులు చేపట్టాల్సి వుంది.

తుని-నర్సీపట్నం మార్గంలో శృంగవరం-గన్నవరంమెట్ట మధ్య 4.3 కిలోమీటర్ల మేర రోడ్డు మొత్తం ఛిద్రమై అధ్వానంగా ... మిగతా 6వ పేజీలో



అచ్యుతాపురం రూరల్: తిమ్మరాజుపేట రామాలయంలో నవమి వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయకుమార్



పాయకరావుపేట రామాలయంలో పూజలు చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పి.చిట్టిబాబు తదితరులు



ఎలమంచిలి కాకివానివీధిలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కమనీయం.. రాములోరి కల్యాణం

» భక్తులతో కిటకిటలాడిన రామాలయాలు » అన్నసమారాధనలు ఏర్పాటు » వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

పాయకరావుపేట/రూరల్/అచ్యుతాపురం/రూరల్/మునగపాక/రాంబిల్లి/ఎలమంచిలి/కోటవురట్ల/నక్కపల్లి/ఎస్.రాయవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్ని రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేసి, పూలు, మామిడి తోరణాలతో అలంకరించారు. గ్రామపెద్దల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అనంతరం మేళతాళాలతో కల్యాణ మూర్తులను ఊరేగించారు. ఈ సందర్భంగా అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పాయకరావుపేట మంగవరం రోడ్డు, దుర్గానగర్, నాగరాజుపేట, శెట్టిబలిజీల వీధి, పట్టుశాలీల వీధిలోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మంగవరంరోడ్డులోని సీతారామాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

పాయకరావుపేట రూరల్ మండలంలోని సత్యవరం, పాల్తేరు, పెదరాంభద్రపురం, మాసాహెబ్‌పేట, మంగవరం, గోపాలపట్నం, అరట్లకోట, శ్రీరాంపురం, కుమారపురం, తదితర గ్రామాలలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిపారు. పాల్తేరు రామాలయంలో ఆలయ ధర్మకర్త దేవవరపు రాంబాబు, మాధవి దంపతులు పల్లకిని అందజేశారు. ఈ కార్యక్రమంలో తుని తపోవనం ఆశ్రమ నిర్వాహకులు సచ్చిదానంద సరస్వతి, జనసేన నాయకులు తోట నగేశ్, దేవవరపు వెంకటరావు, శ్రీను, అర్జున్, దేవవరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. పెంటకోటలోని వాడపేటలోని రామాలయం వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు.

అచ్యుతాపురం మండలంలోని దోసూరు, మడుతూరు, రామన్నపాలెం, అచ్యుతాపురం, వెదురువాడ, దిబ్బపాలెం, పూడిమడక గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాములు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

అచ్యుతాపురం రూరల్ మండలంలోని తిమ్మరాజుపేట రామాలయంలో జరిగిన కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు భీశెట్టి రాము, కర్రి ఆదిబాబు, శరగడం నాగార్జున, శివబాపునాయుడు, ఆనంత్ పాల్గొన్నారు.



నక్కపల్లి: ఉపమాకలో సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

మునగపాక మండలం నాగులాపల్లిలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ పాల్గొన్నారు. అరబుపాలెం, మందబయల, సంతబయల, దళితకాలనీ, వాడ్రాపల్లి, చూచుకొండ, గవర్ల అనకాపల్లి, వెంకటాపురం, తిమ్మరాజుపేట, మూలపేట గ్రామాల్లో సీతారాముల కల్యాణం అనంతరం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. గణపర్తి రామాలయానికి అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, స్వర్గీయ కర్రి పోలినాయుడు కుటుంబీకులు కర్రి గోదారమ్మ, వరహా సత్యానాయుడు, కాశీవిశ్వనాథం, గౌరీ శంకర్ రథాన్ని కానుకగా ఇచ్చారు. కార్యక్రమాల్లో ఏపీ గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం పాల్గొన్నారు.

రాంబిల్లి మండలంలో అన్ని పంచాయతీల్లోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. లాలంకోడూరు రామాలయంలో జరిగిన వేడుకల్లో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జనసేన నాయకుడు లాలం చందు పూజలు చేశారు. రాంబిల్లిలో మాజీ ఎమ్మెల్యే యూవీ.రమణమూర్తిరాజు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. మర్రిపాలెంలో సీతారాములకు గ్రామస్థులు సారెను సమర్పించారు.

ఎలమంచిలి పట్టణంలోని కొత్తపేట, పాతవీధి, ఎన్టీఆర్ కాలనీ, కాకివాని వీధి, క్లబ్‌రోడ్డు, ధర్మవరం, కొత్తపాలెం, పెదపల్లిలతోపాటు మండలంలోని ఏటికొప్పాక, పులపర్తి, పీఎన్ఆర్‌పేట తదితర గ్రామాల్లో ఆదివారం రామాలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని సీతారాముల ఆలయాల వద్ద భక్తులకు మజ్జిగను శ్రీ సిమెంటు జీఎం. తిలక్‌బాబు, ఆర్ఎం. గణేష్, వ్యాపారవేత్త మొగలపల్లి కాశీ, ఏఎస్. లోకేశ్, ధర్మసాయి అప్పారావు, బొద్దపు నాగు, బొద్దపు శ్రీను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధులు కొఠారు సాంబ, కాండ్రకోట చిరంజీవి, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, నేతలు పాల్గొన్నారు.

కోటవురట్ల మండలం కైలాసపట్నంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు రాములోరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటవురట్లలో టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, జానకి హరి ఆధ్వర్యంలో రామాలయంలో పూజలు నిర్వహించారు. పాములవాక, రామచంద్రపురం, టీకేపల్లి, జల్లూరు, తదితర గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నక్కపల్లి మండలం ఉపమాక మెరకవీధిలో సీత,రామ,లక్ష్మణ, సమేత అంజనేయస్వామి ఉత్సవమూర్తులకు ఉపమాక దేవస్థానం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉద్దండపురం, రేబాక, గొడిచెర్ల, జానకయ్యపేట, వేంపాడు, పెదతీనార్ల, రాజయ్యపేట, గుల్లిపాడు, కాగిత గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు అట్టహాసంగా జరిగాయి.

ఎస్.రాయవరం మండలంలోని తిమ్మాపురం, గెడ్డపాలెం, ఎస్.రాయవరం, దార్లపూడి, పెదగుమ్ములూరు, ధర్మవరం అగ్రహారం తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పెట్టుగోళ్లపల్లిలో కొప్పిశెట్టి రమణబాబు కుటుంబ సభ్యులు స్వామివారి కల్యాణం నిర్వహించారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పేదలకు చీరలు, దుప్పట్లు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ఎలమంచిలి ఎంపీడీవో కొప్పిశెట్టి కొండలరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు బి జోగునాయుడు పాల్గొన్నారు.



అచ్యుతాపురం మండలంలోని సెజ్ పునరావాస కాలనీలో రాములోరి కల్యాణం జరుగుతున్న దృశ్యం



రాంబిల్లి రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



మునగపాక పంచాయతీ వద్ద సీతారాముల కల్యాణం

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



ఎలమంచిలి: ఏటికొప్పాకలో బీజేపీ జెండాను ఎగురవేసిన పార్టీ మండల అధ్యక్షుడు కుమారస్వామి

అచ్యుతాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరాలని బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కూండ్రపు నాయుడుబాబు, కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంతిన భక్తసాయిరాం, రాష్ట్ర సైనిక సెల్ కో-కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, నాయకులు కొరుప్రోలు చిన్నారావు, కర్రి వెంకట స్వామినాయుడు, జీవీఎస్ రాజు, శీరా చిరంజీవి, ఎండపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి, ఏటికొప్పాక గ్రామాల్లో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. ఏటికొప్పాకలో బీజేపీ మండల అధ్యక్షుడు అగ్రహారపు కుమారస్వామి స్థానిక నేతలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎలమంచిలి పార్టీ కార్యాలయం వద్ద నేతలంతా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమాల్లో కడారి అప్పలరాజు, నగిరెడ్డి శ్రీను, మొల్లేటి ప్రసాద్, ఉగ్గిన బాబూజీ పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

బీజేపీ ఆవిర్భావం దినోత్సవాన్ని మండలంలోని సోముదేవుపల్లి, నీలాద్రిపురం గ్రామాల్లో ఆదివారం కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, మండల అధ్యక్షుడు బాధనపల్లి జోగినాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రవిరాజు, జోగినాయుడు బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేనాపతి సూర్యారావు, రాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో..

మండలంలో నాగులాపల్లితోపాటు పలు గ్రామాల్లో ఆదివారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాగులాపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు కాశీశ్వరరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ భాస్కరరావు, జ్యోతిష్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుల అంగీకారంతోనే భూములు తీసుకోవాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు



గొరపూడిలో రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం జిల్లా నేతలు

రాంబిల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గొరపూడి రెవెన్యూ పరిధిలో బల్క్ డగ్ ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం రైతులకు ఇష్టం లేకుండా భూములు తీసుకోరాదని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన పార్టీ నేతలతో కలిసి గొరపూడి, జడ్.చింతువా పంచాయతీల్లో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు భూములు ఇవ్వమని చెప్పినా అధికారులు భయపెట్టి భూములు తీసుకుంటామని ప్రకటనలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నేతలు రొంగలి రాము, మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, కమిటీ సభ్యులు వై.రాము, సిహెచ్ నూకన్న, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర తైక్వాండో పోటీల్లో తిమ్మాపురం క్రీడాకారులకు పతకాలు



పతకాలు సాధించిన అడ్డరోడ్డు తిమ్మాపురానికి చెందిన తైక్వాండో క్రీడాకారులు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన రాష్ట్ర జూనియర్ టైక్వాండో పోటీల్లో అడ్డరోడ్డు తిమ్మాపురం తైక్వాండో క్లబ్‌కు చెందిన ఏడుగురు క్రీడాకారులు పతకాలు సాధించారని అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ ఎ.కొండలరావు, సెక్రటరీ రెడ్డి రామ్‌చరణ్ తెలిపారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ జూనియర్ స్థాయిలో జిల్లా నుంచి 33 మంది క్రీడాకారులు పాల్గొనగా.. అడ్డరోడ్డు తిమ్మాపురానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు నాలుగు బంగారు పతకాలు, ఒక కాంస్య, రెండు రజిత పతకాలు సాధించారన్నారు. అనంతరం పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్ ఎం. చిరంజీవి కుమార్, అసోసియేషన్ కోచ్‌లు డి.హేమంత్, డి.యశ్వంత్, డి. భాస్కర్, ఎన్. రామకృష్ణ, మోహన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత రోజులు గుర్తుకు వచ్చి.. హోదాను మరిచి పోయి...

రోడ్డు పక్కన చిన్నపాటి దుకాణంలో టీ తాగిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన సొంత నియోజకవర్గం నర్సీపట్నంలో పర్యటించేటప్పుడు హోదాను మరిచిపోతుంటారు. ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామ దేవతల ఉత్సవాల్లో పాల్గొన్నప్పుడు ప్రొటోకాల్‌ను కాసేపు పక్కన పెట్టి, సాధారణ ప్రజానీకంతో మమేకం అవుతుంటారు. వారి సమస్యలు, యోగ క్షేమాలు, మంచిచెడ్డల గురించి వాకబు చేస్తుంటారు. సెక్యూరిటీని పక్కన పెట్టి అక్కడ ప్రజలతో కలిసిపోతారు. తాజాగా ఆదివారం నర్సీపట్నంలో పురాతనమైన ఒక రాజస్థానీ టీ స్టాల్‌లో తేనేరు సేవించారు. అంతకుముందు శ్రీరామ నవమి పండుగ నర్సీపట్నం అబీద్ సెంటర్‌లోని రామాలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తరువాత గుడి పక్కనే ఉన్న రాజస్థానీ టీ దుకాణంలోకి వెళ్లారు. స్టూల్ మీద కుర్చుని టీ ఆర్డర్ చేశారు. దుకాణం నిర్వాహకుడు గాజు గ్లాసులో టీ పోసి ఇచ్చాడు. అయ్యన్నపాత్రుడు టీ తాగుతూ.. కార్యకర్తలతో కలిసి తరచూ ఇక్కడ టీ తాగేవాడినని పాత రోజులను గుర్తు చేసుకున్నారు.



రోడ్డు పక్కన దుకాణంలో కుర్చొని టీ తాగుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

రసాయన విషవాయులు పీల్చి హెల్పర్ మృతి

... 5వ పేజీ తరువాయి

క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. వెంటనే సహచర కార్మికులు రాంకీకి చెందిన ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించి సీఆర్‌పీ చేశారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. ఇతనికి భార్య సత్యవతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృత దేహానికి ఆదివారం కేజీహెచ్ మార్చురీ లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాద స్థలిని ఆదివా రం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను రాంకీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నా రు. కాగా రసాయన వ్యర్థాల నమూనాలను సేకరించే సమయంలో ధరిస్తామని, యాజమాన్యం నాసిరకమైన మాస్కులను సరఫరా చేయడం వల్లనే అప్పలనాయుడు మృతిచెందాడని సహచర కార్మికులు ఆరోపిస్తున్నారు.

మృతుని కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం

వ్యర్థ రసాయనాలు పీల్చడంతో మృతి చెందిన చీపురుపల్లి అప్పలనాయుడు కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం అందించేందుకు రాంకీ యాజమాన్యం అంగీకరించింది. దహన సంస్కార ఖర్చుల నిమి త్తం అదనంగా రూ.లక్ష ఇస్తామని, మృతుని భార్యకు శాశ్వత ఉపాధి, ఇద్దరు పిల్లలను ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు కార్పొరేట్ పాఠశాల/కళాశాలలో చదివించేందుకు రాంకీ యాజమాన్య ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ చర్చల్లో జడ్పీటీసీ సభ్యు డు పైలా సన్యాసిరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైలా జగన్నాథరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్, సీఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

ఉండడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి గత ఏడాది డిసెంబరులో నిధులు మంజూరు చేయించారు. రూ.14 కోట్ల న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు గ్రాంటుతో పదిచోట్ల కల్వర్టులు, రెండుచోట్ల వంతెనల నిర్మాణం, మన్యపురట్ల సెంటర్ సమీపంలో సీసీ రోడ్డు, మిగిలిన చోట్ల తారు రోడ్డు వేస్తారు. జనవరిలో పనులు మొదలుపెట్టారు. భారీ గోతులు మొత్తం పూడ్చివేశారు. మన్యపురట్ల సెంటర్ సమీపంలో చిత్తడి నేల కావడంతో తారు రోడ్డు వేసినా ఫలితం ఉండదన్న ఉద్దేశంతో ఇక్కడ సిమెంట్ కాంక్రీట్ రోడ్డు వేశారు. మిగిలినచోట్ల బీటీ రోడ్డు మొదటి లేయర్ పనులు పూర్తయ్యాయి. ఇంతవరకు అయిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఇటీవల వరకు ఆర్థిక సంవత్సరం చివరినెల కావడంతో బిల్లులు క్లియర్ కాలేదు. ఈ నెలలో బిల్లులు మంజూరు అవుతా యని అధికారులు చెబుతున్నారు. బిల్లులు విడుదలైన వెంటనే కల్వర్టులు, వంతెనల నిర్మాణంతోపాటు రెండో విడత బీటీ లేయర్ పనులు మొదలుపెడతామని పేర్కొన్నారు.

నేడే చోడమాంబిక అమ్మవారి జాతర



అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోడపల్లి చోడమాంబిక అమ్మవారి పుట్టిక జాతర సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 7న పుట్టిక జాతర నుంచి 15వ తేదీన జరిగే పెద్ద పండుగతో ముగియనుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, తప్పెటగుళ్ల పోటీలను ఏర్పాటు చేస్తున్నారు. పండుగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్టు సీఐ నమ్మి గణేష్ తెలిపారు.

సంపద కేంద్రంలో వానపాములు విడుదల



సంపద కేంద్రంలో వానపాములను విడుదల చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎల్.పురం సంపద కేంద్రంలో ఆదివారం పంచాయతీ అధికారులు వానపాములను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖరరావు మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. అక్కడ తయారైన వర్మీ కంపోస్టును రైతులు కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ. శివరాం, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉపాధి అవకాశాలకు ఇంటర్వ్యూలు

ఎలమంచిలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 8వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కేఎస్. కొండలరావు తెలిపారు. శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశం కల్పించడం కోసం ఒక క్యూ ఆర్ కోడ్ ద్వారా వారి వివరాలు యువత నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ వివరాలు నేరుగా సీడాప్ వద్దకు చేరుతాయని, వారు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఐటీ, ఆటోమేటివ్, లాజిస్టిక్, ఎలక్ట్రానిక్స్, హార్డ్‌వేర్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ క్యాపిటల్ గూడ్సు తదితర రంగాల్లో శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం నెలకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకూ వేతనం ఉంటుందని తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

చీడిక కొత్తూరులో అరటి తోటల పరిశీలన



నేలకొరిగిన అరటి తోటలను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

నక్కపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిక కొత్తూరులో ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి తోటలను సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం ఈదురుగాలుల కారణంగా 12 ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతిన్నాయన్నారు. ఎకరానికి రూ.1 లక్ష చొప్పున పరిహారం ప్రభుత్వం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, కన్నారావు, నర్సింగరావు, వి.శ్రీను, రాజేశ్,వెంకటేశ్, వి.సత్యనారాయణ ఉన్నారు.

ఉపమాకలో ముగిసిన సప్తాహం

నక్కపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గత 30వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు ఉపమాక మెరకవీధి రామాలయంలో నిర్వహించిన సప్తాహం ఆదివారం ఘనంగా ముగిసింది. ఉదయం పలు ప్రాంతాల భజన సమాజాలకు చెందిన వాద్యకళాకారులను ఉపమాక శ్రీనివాసా భజన భక్త సమాజం సత్కరించి, శ్రీవారి చిత్రపటాలను బహూకరించింది.

రెండు కిలోల గంజాయితో ఐదుగురి అరెస్టు



గంజాయి విక్రయదారులతో పోలీసు సిబ్బంది

అచ్యుతాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకర్ల వద్ద రెండు కిలోల గంజాయితో ఐదుగురిని ఆదివారం అరెస్టు చేసినట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. ఆదివారం కొండకర్ల వద్ద కొంతమంది వ్యక్తులు గంజాయి తాగడంతోపాటు విక్రయించడానికి సిద్ధంగా ఉన్నారన్న సమాచారం అందడంతో ఎస్ఐలు సుధాకర్, వెంకటరావు, సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్టు చేసి, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి విక్రయించటం నేరమని, పట్టుబడితే కఠిన చర్యలుంటాయని సీఐ గణేశ్ హెచ్చరించారు.

'నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి'

పాయకరావుపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య శిక్షణ సంస్థ ద్వారా ఇచ్చే ఉచిత శిక్షణ తరగతులను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్య శిక్షణ సంస్థ, సీడీప్ ద్వారా బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తోందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అర్హత కలిగిన వారికి ప్రత్యేక స్కాలర్‌షిప్‌తో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల యువత క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 8వ తేదీన పాయకరావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

... 5వ పేజీ తరువాయి

కల్యాణోత్సవాలు ముగుస్తాయి. కాగా స్వామివారి వార్షిక తిరు కల్యాత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి దర్శన వేళల్లో మార్పులు చేసినట్టు ఆలయ అధికారులు ప్రకటించారు. ఈ నెల 7 నుంచి 14 వరకు సుప్రభాతసేవ, ఉదయం, రాత్రి ఆరాధన సేవ టికెట్ల విక్రయాలను రద్దు చేశారు. ఈ రోజుల్లో రాత్రి 7 గంటల తరువాత భక్తులకు స్వామివారి దర్శనాలు లభించవు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

▸▸ వివిధ ప్రాంతాల నుంచి భారీగా రాక ▸▸ అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం దర్శనాలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. బాలాలయంలోని అమ్మవారికి తెల్లవారుజామున అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక ఆరంభమైంది. పెద్ద సంఖ్యలో కుటుంబాలతో వచ్చిన వారు అమ్మవారి దర్శనం అనంతరం పరిసరాల్లో వంటలు వండుకుని, నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదరన

: నూకాంబిక కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదికపై ఆదివారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన, భక్తి గీతాల ఆలాపన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రదర్శన నిర్వాహకులను జనసేన నియోజకవర్గ కన్వీనర్ భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


కొత్తూరు శారదానగర్‌లో సీతారాముల పల్లకి ఊరేగింపులో పీలా


చినబజార్ వద్ద కల్యాణానికి పట్టు వస్త్రాలు తెస్తున్న రాంకీ


పెదరామస్వామి ఆలయంలో పీలా, బత్తుల తదితరులు

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

▸▸ అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి వేడుకలు

▸▸ ఆలయాలకు భారీగా తరలి వచ్చిన భక్తజనం


అనకాపల్లిలోని చినబజార్ వద్ద కల్యాణ వేడుకలో భాగంగా మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు

అనకాపల్లిటౌన్/ అనకాపల్లి రూరల్/కొత్తూరు/తుమ్మపాల/కశింకోట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి వేడుకలను ప్రజలంతా ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అనకాపల్లి మెయిన్ రోడ్డులో గల చినబజార్ సీతారాముల ఆలయం వద్ద ఆరుబయట సీతారాముల కల్యా ణాన్ని కన్నుల పండువగా జరిపారు. స్వామివారికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రవీణ్‌కుమార్, నీలిమా దంపతులు స్వామివారికి కల్యాణం నిర్వహించారు. అలాగే ఎంపీ సీఎం రమేశ్ కార్యాలయ ఇన్‌చార్జి విజయనాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు కొణతాల జగన్నాథరావునాయుడు, అధ్యక్ష, కార్యదర్శులు కె.నారాయణరావు, సిరసపల్లి సూరిబాబు పాల్గొన్నారు. సంతబయలు పెదరామస్వామి ఆలయంలో దాడి జగన్ ప్రభాకర్ దంపతులు స్వామివారి కల్యాణం జరిపించారు. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులు సీతారాములను దర్శించుకున్నారు. వీరికి టీడీపీ నేత దాడి రత్నాకర్ స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నేత బుద్ద నాగజగదీశ్వరరావు కోట్నివీధి, గొల్లవీధి, నెయ్యిలవీధి, చినబజార్, ముత్రాసుకాలనీ, చినరామస్వామి, పెదరామస్వామి ఆలయాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే, మేజర్ పంచాయతీ కొత్తూరు శారదానగర్ నాలుగో వీధి, శారదా నది గట్టు వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, దొడ్డి నాగేశ్వరరావు, నైనంశెట్టి రమణారావు, సంజీవరావు తదితర కూటమి నేతలు పాల్గొన్నారు. అలాగే, తుమ్మపాల, దిబ్బపాలెం, మార్టూరు, మామిడిపాలెం, కొండుపాలెం తదితర గ్రామాల్లో గల రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తుమ్మపాల గవరపేట వీధి రామాలయంలో జరిగిన కల్యాణ మహోత్సవానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కశింకోట మండలంలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద కశింకోట కస్పావీధి రామాలయం, కోదండస్వామి రామాలయాలకు వెళ్లి సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్నారు. అలాగే గ్రామ గ్రామాన ఈ వేడుకలు జరిగాయి.

పరవాడ : శ్రీరామ నవమి వేడుకలను మండల వాసులంతా ఘనంగా జరుపుకున్నారు. పరవాడ రామాలయం వద్ద సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా జరిపారు. సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు దంపతులు పాల్గొన్నారు. తానాంలో సర్పంచ్ కన్నూరుదేవి వెంకటరమణ దంపతులు, వాడచీపురుపల్లి రామాలయం వద్ద మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దంపతులు తదితరులు కల్యాణం జరిపించారు.

లంకెలపాలెం : శ్రీరామ నవమి వేడుకలను లంకెలపాలెం, శ్రీరామ్‌నగర్, సాలాపువానిపాలెం, మంత్రిపాలెం, మడకపాలెం, కన్నూరు, పెదముషిడివాడ, పచ్చికోరువానిపాలెం, నక్కవానిపాలెం, గండివానిపాలెం, విజయరాంపురంలలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా రామాలయాల వద్ద సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

సబ్బవరం : మండల ప్రజలు నవమిని ఘనంగా జరుపుకున్నారు. సబ్బవరం, గొర్లివానిపాలెం, రావలమ్మ పాలెం, మొగలిపురం, మలునాయుడుపాలెం, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, నల్లరేగులపాలెం, గుల్లేపల్లి, అమృతపురం, పెదనాయుడుపాలెం, సాయినగర్ శివ పంచాయతనం దేవాలయం, అసకపల్లి తదితర గ్రామాల్లోని రామాలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా వేదపండితులు సంప్రదా యం ప్రకారం సీతారాముల కల్యాణాన్ని జరిపించారు.

వైసీపీకి ‘చొక్కాకు’ల రాజీనామా

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరొకనేత గుడ్‌బై చెప్పేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విశాఖ-కాకినాడ పెట్రోకారిడార్ రీజియన్(వీకేపీసీఆర్) మాజీ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు వైసీపీకి రాజీనామా చేసినట్టు ఆదివారం ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు. పార్టీలో నేతలు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లేదని, అధికారంలో ఉన్న ఐదేళ్లు రాష్ట్ర అభివృద్ధిని గాలికివదిలేసిన జగన్‌మోహన్‌రెడ్డికి తిరిగి ప్రజలు ఓటేసే పరిస్థితి లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతానికి ఏ పార్టీలోనూ చేరాలనుకోవడం లేదని, భవిష్యత్తులో అనుచరులతో చర్చించి ఏ పార్టీలో చేరాలనే దానిపై నిర్ణయం తీసుకుంటానన్నారు.

అపార్టుమెంట్లలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అపార్టుమెంట్లు, షాపింగ్‌మాల్స్‌కు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు ఆది వారం ఆయా యాజమాన్యాలకు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది పలు అపార్టుమెంట్లు, షాపింగ్‌మాల్స్‌లకు వెళ్లి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్టు 2013 సెక్షన్ 3 (1) ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలియజేస్తూ నోటీసులు అందజేశారు.

పోలీసు యూనిఫాంలో వివాహిత హల్‌చల్

▸▸ నెహ్రూచౌక్‌లో వాహనదారులకు హెచ్చరికలు

▸▸ పరిస్థితిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన సీఐ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నెహ్రూచౌక్‌లో ఆదివారం ఓ వివాహిత హల్‌చల్ చేసింది. పోలీసు యూనిఫాం వేసుకుని జంక్షన్‌లో వచ్చిపోయే వాహనదారులకు పోలీసుల తరహాలో హెచ్చరించింది. ఆమె ప్రవర్తనను చూసి ఒక్కసారిగా స్థానికులు అవాక్కయ్యారు. పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణలు మహిళా పోలీసులతో కలిసి నెహ్రూచౌక్‌కు చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. ఈమె అనకాపల్లి మండలం సంపతిపురానికి చెందిన త్రివేణిగా సీఐ తెలిపారు. మానసికంగా ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించి ఆమె భర్తకు సమాచారం అందజేశారు. అనంతరం సంపతిపురంలో కుటుంబ సభ్యులకు అప్పగించి, వైద్యం చేయించాలని సీఐ సూచించారు.


నెహ్రూచౌక్‌లో పోలీసు యూనిఫాంలో ఉన్న వివాహిత

శక్తి యాప్‌పై అవగాహన అవసరం

మహిళలకు ఎస్ఐ వెంకటేశ్వరరావు సూచన

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులోని ఒక షాపింగ్ మాల్‌లో ఆదివారం మహిళలకు శక్తి యాప్‌పై పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమన్నారు. ఇలా వివాహాలు చేయడం వల్ల ఎదురయ్యే అనర్థాలను తెలియజేశారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, ఫోక్సో చట్టం తదితరాల గురించి వివరించారు. ఎవరికి ఏ సమస్య తలెత్తినా టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1098కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మణికుమారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు

రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

కొత్తూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం అనకాపల్లిలోని ఎంపీ సీఎం రమేష్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయడమే అందరి లక్ష్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి విజయ్, తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే, బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని అనకాపల్లిలోని పార్టీ 80వ డివిజన్ అధ్యక్షుడు మారిశెట్టి భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శంకర్ థియేటర్ వద్ద ఉన్న దాసరిగెడ్డ కూడలిలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉడా రమేష్, సన్యాసిరావు, రాపేటి సంతోష్, నర్సింగ్ యాదవ్, కొణతాల అప్పలరాజు, పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడ, పి.బోనంగి గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలిత పార్టీ జెండాను సర్పంచ్ బండారు కల్పన, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. పార్టీ నాయకులు కూండ్రపు సోమినాయుడు, పిల్లా సతీశ్, బండారు రాజశేఖర్, గండి నమోబాబు, గోవింద్, సత్యారావు, మోసా రామకృష్ణ, సోమశేఖర్, అజయ్, నూకరాజు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ సీఎం రమేశ్ కార్యాలయంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవంలో బీజేపీ శ్రేణులు

నేడు పెందుర్తిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్రాన్సిట్ హాల్ట్

▸▸ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం అరకు పర్యటనను అంతా విజయవంతం చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో అడవితల్లి బాట కార్యక్రమంలో భాగంగా ఆయన అరకు వెళతారన్నారు. మార్గ మధ్యలో గల పెందుర్తిలో ఉదయం ఏడు గంటలకు ట్రాన్సిట్ హాల్ట్ చేయనున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు పెందుర్తి కూడలిలో ఘన స్వాగతం పలికేందుకు భారీగా తరలి రావాల్సిందిగా పార్టీ శ్రేణులు, అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల పాటు స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు క్లబ్ అధ్యక్షుడు బీఎస్ ఎంకే జోగినాయుడు, దంతులూరి దిలీప్‌కుమార్, శరగడం శ్రీరామచంద్రమూర్తి బహుమతులు అందజేశారు. శరగడం మహాలక్ష్మి జయంతి సం దర్భంగా షటిల్ బ్యాడ్మింటన్, లాంగ్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. బహుమతుల ప్రదానోత్సవంలో కొల్లి శ్రీనివాస్, ఆళ్ల రామచంద్రరావు, చవితిన నరసింగరావు, దాడి ఈశ్వరరావు, విల్లూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల దీక్షలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఎన్ఎంయూఏ ఆధ్వ ర్యంలో కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 37వ రోజుకు చేరుకున్నాయి. యూనియన్ నాయకులు మాట్లాడుతూ అకారణంగా సస్పెన్షన్ చేసిన డ్రైవర్, కండక్టర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో ఏపీఎస్ రాజు, కేఎం నాథ్, ఎంజే రావు, వీవీఎస్ శ్రీనివాస్ కూర్చున్నారు.


సుంద్రుపుట్టు ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న గిడ్డి ఈశ్వరి


చింతపల్లి ఆలయంలో సీతారాముల కల్యాణం


సీలేరు రామాలయంలో..


జి.మాడుగుల రామాలయంలో కల్యాణం జరిపిస్తున్న బాలరాజు

కల్యాణ వైభోగమే..

- జిల్లా వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు
- ఆలయాలకు భారీగా తరలివచ్చిన భక్తజనం
- వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కల్యాణం



పాడేరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పచ్చని తోరణాలు.. వివిధ రకాల పుష్పాలంకరణలు.. చలువ పందిళ్లు.. వాటిలో భక్తజన కోలాహలం.. ఇవీ.. ఆదివారం అల్లూరి జిల్లాలోని పలు గ్రామాల్లో గల రామాలయాల్లో కనిపించిన దృశ్యాలు. శ్రీరామ నవమిని అంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాడేరు పట్టణం సుంద్రుపుట్టు గ్రామంలోని పురాతన రామాలయంలో ఈ వేడుకలు మరింత ఘనంగా జరిగాయి. వేలాది మంది భక్తులు ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బారులుతీరారు. తొలుత స్వామి వారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సీతారాములకు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు తొలుత స్వాగతం పలికారు. పూజల అనంతరం శాలువాతో సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సీతారాముల కల్యాణాన్ని అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించి తరలించారు. భక్తులకు వాసవీ క్లబ్ ప్రతినిధులు పానకం పంపిణీ చేశారు. అదే విధంగా మండలంలోని కిండంగి పంచాయతీ కేంద్రంలోని రామాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఆలయ ధర్మకర్త బొర్రా నాగరాజు, విజయరాణి దంపతులు నిర్వహించిన కల్యాణంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అలాగే, డి.గొందూరు పంచాయతీ సూకూరుపుట్టు గ్రామంలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణాన్ని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి, గిరిజన అర్చకుల జిల్లా అధ్యక్షుడు కూడా రామకృష్ణ పరమహంస ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. శ్రీరామనవమి సందర్భంగా సుం ద్రుపుట్టు, కిండంగి ఆలయాల వద్ద ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు వందలాది మంది భక్తులు విచ్చేసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే ఇరడాపల్లి, రాయిగెడ్డ, మినుములూరు, గుత్తులపుట్టు తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయ కమిటీ, ఉత్సవక మిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చింతపల్లి మండలంలో...

చింతపల్లి : మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా చింతపల్లిలోని రామాలయంలో వేకువ జామున స్వామివారికి విశేష పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకను వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి వీక్షించి తరించారు. అనంతరం సీతారాములను పల్లకీలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటైంది. ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, రాధ దంపతులు, ఎంపీపీ కోరాబు అనూషాదేవి, ఆలయ ధర్మకర్త మాదాబత్తుల సత్తిబాబు, కమిటీ సభ్యులు రమణమూర్తి, పైలా శ్రీనివాసరావు, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, వర్తక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు మండలంలో...

కొయ్యూరు : శ్రీరామ నవమి వేడుకలను మండల వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేదపండితులు సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కాకరపాడు గ్రామంలోని పురాతన ఆలయంలో చిటికెల కిశోర్, లక్ష్మి, విజయ్, స్వప్న, వరుపుల వెంకటేశ్, దేవి దంపతులతో కొయ్యూరుకు చెందిన వేద పండితులు సాయిశర్మ కల్యాణం జరిపించారు. గ్రామ యువజన నేత కాకర చంద్రరావు, పెద్దలు పాడి లోవరాజు, పొడుగు చంద్రరావు, గ్రామస్థుల సహకారంతో అన్నసమారాధన జరిపారు. బంగారమ్మపేటలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. శరభన్నపాలెంలో గ్రామస్థుల సహకారంతో కొనుగోలు చేసిన సీతారామ సహిత లక్ష్మణ భరత శత్రుఘ్నాలతో కూడిన ఆంజనేయ స్వామి కాంస్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం సాతా పత్తిబాబు దంపతులు కల్యాణంలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. అలాగే, రాజేంద్రపాలెం, నడంపాలెం, మర్రివాడ, రేవళ్ళ ములకలపాడు, బాలారం, బకులూరు, కంఠారం, చింతలపూడి గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను విశ్వ హిందూ పరిషత్, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు.


పాడేరు పట్టణంలోని సుంద్రుపుట్టు ఆలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

జి.మాడుగుల మండలంలో...

జి.మాడుగుల : శ్రీరామ నవమిని మండల ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు గ్రామాల్లో గల రామాలయాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. జి.మాడుగులలోని రామాలయంలో మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపారు. అలాగే కుల్లుపాడు, బందవీధి, నుర్మతి, పెదలోచలి తదితర గ్రామాల్లో రామాలయాల్లో ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రం జి.మాడుగులలో జడ్పీటీసీ సభ్యురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది.

సీలేరు, పరిసర గ్రామాల్లో...

సీలేరు : జీకేవీధి మండలంలోని సీలేరు, వలసగెడ్డ, ధారకొండ, గుమ్మిరేవుల గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. ఉదయం శుభ ముహూర్తాన వేదపండితులు రామాచారి సీతారాముల కల్యాణాన్ని జరిపారు. సాయి సత్సంగ బృందం సీతారాముల పాటలను ఆలపిస్తూ కోలాటాన్ని ప్రదర్శించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిపారు.

ముంచంగిపుట్టు మండలంలో...

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముంచంగిపుట్టు రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమరాధన కార్యక్రమంలో సుమారు రెండు వేలకుపైగా భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే బొంద్రుగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సీతారాములను దర్శించుకున్నారు.

అనంతగిరి మండలంలో...

అనంతగిరి: మండల కేంద్రంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. రాములవారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వర్తక సంఘం సభ్యులు వీరస్వామి, రాజు, మోహన్, మన్మధరావు, శ్రీను, వెంకటేశ్ పాల్గొన్నారు.


కొయ్యూరు మండలం కాకరపాడులో...

హుకుంపేట మండలంలో...


హుకుంపేటలో స్వామివారి ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

హుకుంపేట: మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హుకుంపేట, అడ్డుమండ, సూకురు, చిడిపుట్టు, కొంతిల్లి, గడుగుపుట్టు, శోభకోట గ్రామాల్లోని రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అడ్డుమండలో ఎంపీటీసీ సభ్యుడు మహేశ్ సమక్షంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు.



ముంచంగిపుట్టులో సీతారాముల కల్యాణ మహోత్సవం... అనంతగిరిలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

మోదకొండమ్మ ఆలయంలో భక్తుల కోలాహలం


మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

పాడేరు రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా కనిపించింది. శ్రీరామ నవమి కావడంతో సుదూర ప్రాంతా నుంచి పెద్దగా రాకపోయినప్పటికీ పరిసర ప్రాంతాల నుంచి విచ్చేశారు. అంతా పసుపు, కుంకుమలు సమర్పించి అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందజేశారు. ఇదిలావుంటే, పాడేరు పట్టణంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, కనకదుర్గమ్మ, వేంకటేశ్వరస్వామి, షిర్డీసాయి ఆలయాలు కూడా భక్తులతో కళకళలాడాయి.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


గూడెంకొత్తవీధిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు బొండ్ల చిరంజీవి పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గూడెంకొత్తవీధిలో నాయకులు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో నేడు దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి పథాన పయనిస్తుందన్నారు. వచ్చే ఎన్నికలు నాటికి బీజేపీ ఇక్కడ స్వతంత్రంగా పోటీ చేసే స్థాయికి కార్యకర్తలు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఎం.రామ్‌కిరణ్ కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి, మండల అధ్యక్షుడు కాకూరి శేఖర్, ఉపాధ్యక్షుడు కె.రామచంద్ర, కార్యదర్శి చిన్నబాబు, కోశాధికారి ఎల్.ప్రసాద్, జర్త సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో...

కొయ్యూరు : బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని రత్నంపేటలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేములు చంద్రరావు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు అరిమెల రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేయడమే అందరి లక్ష్యం కావాలన్నారు.

జాతీయ స్థాయి థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ పోటీలకు జిల్లా విద్యార్థులు


జాతీయ స్థాయి థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ పోటీలకు వెళ్తున్న ఏపీ క్రీడాకారులు

పాడేరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 22 మంది క్రీడాకారులు ఎంపిక కాగా, అందులో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఉండడం విశేషం. ఈ సందర్భంగా ఫెడరేషన్ అల్లూరి జిల్లా కార్యదర్శి వండ లం కొండ బాబు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రం ఇంఫాల్‌లో ఈనెల ఏడో తేదీ నుంచి 12వ తేదీ వరకు ఈ టోర్నమెంటు జరగనుందన్నారు. డుంబ్రిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సురేంద్ర, అరకువేలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐశ్వర్య, దేవీప్రియ, హుకుంపేట కేజీబీవీ విద్యార్థిని మంజు ప్రియ, జి.మాడుగుల కేజీబీవీ విద్యార్థిని ప్రమీళ రాణి, పాడేరు సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థిని నాగ సాయి తన్మయశ్రీలు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.ఇదిలావుంటే, రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో కలిసి జిల్లా కార్యదర్శి కొండబాబు, ఏపీ టీమ్ కోచ్ మేనేజర్లు పాంగి సూరిబాబు, మత్స్యరాస భూపతిరాజు, కమల కుమారి టోర్నీకి పయనమై వెళ్లారు.

24 నుంచి ముత్యాలమ్మ జాతర

చింతపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ముత్యాలమ్మ జాతర విజయవంతానికి ప్రజలందరూ సహకరించాలని ఎంపీపీ కోరాబు అనూషాదేవి అన్నారు. ఆదివారం మండల కేంద్రం చింతపల్లిలో జాతర నిర్వాహణకు ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆమె విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 27 వరకు జాతరను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ నిర్ణయించినట్టు చెప్పారు. ప్రతి రోజూ సాయంత్రం మూడు వేదికల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షులు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు దూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న ఎంపీపీ అనూషాదేవి, ఉత్సవ కమిటీ

అనంతగిరిలో పారిశుధ్య కార్యక్రమం

అనంతగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. అరకు-విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని చెత్తచెదారం తొలగించారు. ప్లాస్టిక్ వాడితే చర్యలు తీసుకుంటామని కార్యదర్శి దేవా హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతి

అనంతగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరిన ఓ రైల్వే ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన అలజంజి ప్రసాద్ (30) అనంతగిరి మండలం శివలింగపురం రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబంతో బొడ్డవరలో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం విధులు ముగించుకుని బొడ్డవరకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, కొత్తూరు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ప్రసాద్ అక్కడికక్కడ మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరికొద్ది క్షణాల్లో భర్త ఇంటికి వస్తానకుంటే మరణ వార్త వచ్చిందని భార్య కన్నీరు మున్నీరుగా విలపించారు. అనంతగిరి ఎస్ఐ డి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మడ్రేబ్‌లో జ్వరాలు

అనంతగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పెదకోట పంచాయతీ మడ్రేబ్ గ్రామంలో గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారు. సుమారు పది మంది మంచం పట్టారు. ఆశ కార్యకర్త మందులు ఇచ్చినప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆస్పత్రికి డోలీమోతలపై తరలించాల్సిన దుస్థితి ఉందని గిరిజనులు వాపోయారు. వైద్య సిబ్బంది స్పందించి, ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలని కోరుతున్నారు.

పెదబయలులో కూలిన భారీ వృక్షం

పెదబయలు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాన రహదారికి పక్కన శనివారం రాత్రి భారీ వృక్షం కూలిపోయింది. సుమారు 150 ఏళ్ల చరిత్ర మర్రి చెట్టు ఎటువంటి గాలివాన లేని సమయంలో నేలకొరిగింది. గండేరు జీవన్‌కుమార్ చెక్కలబడ్డిపై ఒక్కసరిగా కూలింది. దీంతో పక్కన విద్యుత్ స్తంభం ముక్కలుగా విరిగిపోయింది. ఈ ఘటనతో మండల కేంద్రంలో కొన్ని చోట్ల శనివారం రాత్రి నుంచి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. సర్పంచ్ పలాసి మాదవరావు విద్యుత్ శాఖకు సమాచారం అందించారు.

నేటి నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

... 5వ పేజీ తరువాయి

కల్యాణోత్సవాలు ముగుస్తాయి. కాగా స్వామివారి వార్షిక తిరు కల్యాత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారి దర్శన వేళల్లో మార్పులు చేసినట్టు ఆలయ అధికారులు ప్రకటించారు. ఈ నెల 7 నుంచి 14 వరకు సుప్రభాతసేవ, ఉదయం, రాత్రి ఆరాధన సేవ టికెట్ల విక్రయాలను రద్దు చేశారు. ఈ రోజుల్లో రాత్రి 7 గంటల తరువాత స్వామివారి దర్శనాలు లభించవు.

విషవాయులు పీల్చి హెల్పర్ మృతి

... 5వ పేజీ తరువాయి

క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురై కుప్ప కూలిపోయాడు. వెంటనే సహచర కార్మికులు రాంకీకి చెందిన ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించి సీఆర్‌పీ చేశారు. మెరుగైన చికత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. ఇతనికి భార్య సత్యవతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహానికి ఆదివారం కేజీహెచ్ మార్చురీలో పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాద స్థలిని ఆదివారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను రాంకీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కాగా రసాయన వ్యర్థాల నమూనాలను సేకరించే సమయంలో ధరిస్తామని, యాజమాన్యం నాసిరకమైన మాస్కులను సరఫరా చేయడం వల్లనే అప్పలనాయుడు మృతిచెందాడని సహచర కార్మికులు ఆరోపిస్తున్నారు.

మృతుని కుటుంబానికి రూ. 50 లక్షలు పరిహారం

వ్యర్థ రసాయనాలు పీల్చడంతో మృతిచెందిన చీపురుపల్లి అప్పలనాయుడు కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం అందించేందుకు రాంకీ యాజమాన్యం అంగీకరించింది. దహన సంస్కార ఖర్చుల నిమిత్తం అదనంగా రూ.లక్ష ఇస్తామని, మృతుని భార్యకు శాశ్వత ఉపాధి, ఇద్దరు పిల్లలను ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు కార్పొరేట్ పాఠశాల/ కళాశాలలో చదివించేందుకు రాంకీ యాజమాన్య ప్రతినిధులు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు. యాజమాన్య ప్రతినిధులతో జరిపిన చర్చల్లో జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైలా జగన్నాథరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్, సీఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

ఉండడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి గత ఏడాది డిసెంబరులో నిధులు మంజూరు చేయించారు. రూ.14 కోట్లతో పదిచోట్ల కల్వర్టులు, రెండుచోట్ల వంతెనల నిర్మాణం, మన్యపురట్ల సెంటర్ సమీపంలో సీసీ రోడ్డు, మిగిలిన చోట్ల తారు రోడ్డు వేశారు. జనవరిలో పనులు మొదలుపెట్టారు. భారీ గోతులు మొత్తం పూడ్చివేశారు. మన్యపురట్ల సెంటర్ సమీపంలో చిత్తడి నేల కావడంతో తారు రోడ్డు వేసినా ఫలితం ఉండదన్న ఉద్దేశంతో సీసీ రోడ్డు వేశారు. మిగిలినచోట్ల బీటీ రోడ్డు మొదటి లేయర్ పనులు పూర్తయ్యాయి. ఈ పనులకు బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఇటీవల వరకు ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో బిల్లులు క్లియర్ కాలేదు. ఈ నెలలో బిల్లులు మంజూరవుతాయని అధికారులు తెలిపారు. బిల్లులు విడుదలైన వెంటనే కల్వర్టులు, వంతెనలు, రెండో విడత బీటీ లేయర్ పనులు మొదలుపెడతామని పేర్కొన్నారు.

వాడవాడలా రాములోరి కల్యాణం

సీతారాముల కల్యాణ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో వాడవాడలా రాములోరి కల్యాణోత్సవాలు అంబరాన్ని తాకాయి. శ్రీరామనవమి సందర్భంగా రావలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా భక్తులు ఉదయాన్నే తలంటు పోసుకొని సంప్రదాయ దుస్తులు ధరించి రామచంద్రమూర్తి కల్యాణ ఉత్సవాన్ని వీక్షించారు.



రోడ్డు పక్కన దుకాణంలో కుర్చొని టీ తాగుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పాత రోజులు గుర్తుకు వచ్చి... హోదాను మరిచిపోయి..

▸▸ రోడ్డు పక్కన దుకాణంలో టీ తాగిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన సొంత నియోజకవర్గం నర్సీపట్నంలో పర్యటించేటప్పుడు హోదాను మరిచిపోతుంటారు. ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామ దేవతల ఉత్సవాల్లో పాల్గొన్నప్పుడు ప్రొటోకాల్‌ను కాసేపు పక్కన పెట్టి, సాధారణ ప్రజానీకంతో మమేకం అవుతుంటారు. వారి సమస్యలు, యోగ క్షేమాలు, మంచిచెడ్డల గురించి వాకబు చేస్తుంటారు. సెక్యూరిటీని పక్కన పెట్టి అక్కడ ప్రజలతో కలిసి పోతారు. తాజాగా ఆదివారం నర్సీపట్నంలో పురాతనమైన ఒక రాజస్థానీ టీ స్టాల్‌లో తేనేరు సేవించారు. అంతకుముందు శ్రీరామ నవమి పండుగ నర్సీపట్నం అబీద్ సెంటర్‌లోని రామాలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తరువాత గుడి పక్కనే ఉన్న రాజస్థానీ టీ దుకాణంలోకి వెళ్లారు. స్టూల్ మీద కుర్చుని టీ ఆర్డర్ చేశారు. దుకాణం నిర్వాహకుడు గాజు గ్లాసులో టీ పోసి ఇచ్చాడు. అయ్యన్నపాత్రుడు టీ తాగుతూ.. కార్యకర్తలతో కలిసి తరచూ ఇక్కడ టీ తాగేవాడినని పాత రోజులను గుర్తు చేసుకున్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చూడండి

▸▸ డీఎస్పీ శ్రీనివాస్.. 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కూరగాయల దుకాణాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గోవిందరావు

నర్సీపట్నం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం-చింతపల్లి రోడ్డులో కూరగాయలు సంత కారణంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. 'ఇదేం సంత' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కూరగాయల మార్కెట్‌లో రోడ్డుకిరువైపులా దుకాణాలను ఆదివారం పరిశీలించారు. వాహనాల రాకపోకలకు ఆటంకంగా రోడ్డుపై ఉన్న దుకాణాలను వెనక్కి మళ్లించాలని ఈ సందర్భంగా వ్యాపారులకు డీఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ గోవిందరావు పాల్గొన్నారు.

జాతీయ మహిళా సాధికార సదస్సు

చోడవరం, ఏప్రిలల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉషోదయ కళాశాలలో ఆదివారం మహిళా సాధికార సదస్సు జరిగింది. ఈ సదస్సులో జాతీయ స్థాయి పరిశోధకులు తమ పరిశోధన పత్రాలను ఉంచి అభిప్రాయాలను వెల్లడించారు. కళాశాల కరస్పాండెంట్ కృష్ణకుమారి మహిళా సాధికారిత గురించి వివరించారు. సదస్సులో కళాశాల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, డీన్ ఎస్.వెంకటవాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



కృష్ణాదేవిపేటలో హోరున కురుస్తున్న వాన

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో సీసీ రోడ్డుపై వర్షం నీరు ప్రవహించింది. అలాగే కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వద్ద రోడ్డుకు అడ్డంగా వేప చెట్టు కొమ్మపడటంతో స్తంభాలు ఒరిగి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో వర్షం నీటిలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాగా ఉదయం నుంచి ఎండకు హడలెత్తిన ప్రజలు ఈ వర్షంతో సేద తీరారు. ఖరీఫ్ సాగుకు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ముగిసిన లింగంపేట నూకాలమ్మ జాతర

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) లింగంసేట నూకాలమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. కొత్తఅమావాస్య పురస్కరించుకుని నూకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు ఈ జాతర నిర్వహించారు. పలు గ్రామాలు నుంచి భక్తులు నూకాలమ్మతల్లి దర్శించుకున్నారు. తీర్థంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు



పరుగు పోటీల్లో దౌడు తీస్తున్న ఎడ్లబండ్లు

మాకవరపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిడుతూరు గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 14 మంది ఎడ్లబండ్ల యజమానులు పాల్గొనగా, చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామానికి చెందిన సామాలమ్మతల్లి బండి విజేతగా నిలిచింది. అలాగే డి.సుంకవరం, కేఎల్‌బీ.పట్నం, అర్జున్‌గిరి గ్రామాల బండ్ల యజమానులు తర్వాత స్థానాల్లో నిలిచారు. వీరికి పోటీల నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో...

నర్సీపట్నం/నర్సీపట్నం అర్బన్/నాతవరం/గొలుగొండ/కృష్ణాదేవిపేట/మాకవరపాలెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గం కేంద్రంతో పాటు మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వెలమవీధిలోని రామాలయంవద్ద స్వామివారికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల పవిత్ర పండగని శ్రీరామనవమని పేర్కొన్నారు. సంక్రాంతి, ఉగాది, శ్రీరామ నవమి పండగలు తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను ఆవిష్కరిస్తాయని, ఇటువంటి పండగలు పార్టీలకతీతంగా అందరు కలిసి చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు రామాలయాల్లోని సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే మండలంలోని గబ్బాడ, ఓఎల్.పురం, ధర్మసాగరం, పాతలక్ష్మీపురం, వేములపూడి రామాలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. నాతవరం రామాలయంలో వేదపండుతులతో సీతారామ కల్యాణం జరిపారు. అలాగే భారీగా అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. గుమ్మిడిగొండలో కూడా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.



మాకవరపాలెం మండలం నారాయణరాజుపేటలో పూజలు చేస్తున్న భక్తులు

గొలుగొండ మండలంలోని కొత్తజోగంపేట, గొలుగొండ, పాకలపాడు, ఏటిగైరంపేట, కొత్తఎల్లవరం, చీడిగుమ్మల, రావణాపల్లి, కొమిర, శ్రీరాంపురం, కృష్ణాదేవిపేట, పాతకృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, చోద్యం, సీహెచ్.నాగాపురం, లింగంపేట, కొంగశింగి తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల విగ్రహాలకు వేదమంత్రాలతో కల్యాణం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో భారీ అన్నసమారాధన నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, చోద్యం సర్పంచ్ ఎ.గోపాలకృష్ణ, నాయులు పెట్ల నారాయణమూర్తి, బొడ్డు జమీలు, సిహెచ్.చిట్టిబాబు వేడుకల్లో పాల్గొన్నారు. మాకవరపాలెం మండలంలోని తామరం, రాచపల్లి, కొండలఅగ్రహారం, లచ్చన్నపాలెం, గిడుతూరు, తూటిపాల, బూరుగుపాలెం గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నసమరాధన చేపట్టారు.



వడ్డాది ఆలయంలో స్వామివారిన దర్శించుకుంటున్న తాతయ్యబాబు

అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు



కె.కోటపాడు: చౌడువాడలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

చోడవరం నియోజకవర్గంలో...

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట/రోలుగుంట: చోడవరం నియోజకవర్గంలో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



చోడవరం: శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు దంపతులు

చోడవరంలో జరిగిన కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే రాజు దంపతులు పాల్గొన్నారు. అలాగే నాయకులు గూనూరు మల్లునాయుడు, పెదబాబు, సిరిపురపు రమేశ్, దేవరపల్లి వెంకటఅప్పారావు, సరుకు కోటేశ్వరరావు, సేనాపతి శ్రీనివాసరావు వేడుకలను తిలకించారు. రావికమతం మండల కేంద్రంతో పాటు దొండపూడి, మరుపాక, కొత్తకోట గుమ్ముడువీధి, మర్రివలస, కన్నంపేట, టి.అర్జాపురం, తోటకూరపాలెం, గుడ్డిప, నాగన్నపాలెం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు కమనీయంగా జరిగాయి. రావికమతం, కొమిర గ్రామాల్లో భారీ అన్న సమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సభ్యులు గంజి సూర్యనారాయణ, నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, నాయకులు గొర్లె రవికుమార్, జి.సత్యారావు పాల్గొన్నారు. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాదిలో సీతారాముల కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. వడ్డాది రెల్లివీధి, ఎల్‌బి.పురం గ్రామాల్లో స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు సీతారాములను దర్శించుకున్నారు. సీతయ్యపేట సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నవమి వేడుకలు జరిగాయి. సాయంత్రం పుర వీధులలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. రోలుగుంట మండలంలోని కొమరవోలు, రోలుగుంట, కొవ్వూరు, కుసర్లపూడి, నిండుగొండ, బుచ్చెంపేట గ్రామాల్లో నవమి వేడుకులు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు పాల్గొన్నారు.



సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న స్పీకర్ అయ్యన్న దంపతులు

మాడుగుల నియోజకవర్గంలో...



మాడుగులలో పూజలు అందుకున్న ఉత్సవమూర్తులు

మాడుగుల/చీడికాడ/దేవరాపల్లి/కె.కోటపాడు: మాడుగుల నియోజకవర్గంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. మాడుగుల పురాతన దేవాలయం సీతారామ దేవస్థానంతో పాటు గవరవీధి రామాలయం, పార్థసారథి దేవాలయంలో వేకువజాము నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం స్వామివారి తిరువీధి ఉత్సవ ఊరేగింపు జరిగింది. మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకవజామునే అమ్మవారిని అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు.

చీడికాడ మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చీడికాడ దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ప్రత్యేక పూజలు చేశారు. అప్పలరాజుపురంలో ఎంపీపీ కురచా జయమ్మ, సర్పంచులు, మాజీ సర్పంచ్‌లు పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు చుక్క అప్పలనాయుడు, గొల్లవిల్లి చిన్నమ్ములు, గండి ముసలినాయుడు, గండి లక్ష్మి పాల్గొన్నారు. దేవరాపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం కల్యాణ మహోత్సవాలు సంప్రదాయబద్ధంగా చేసి అన్నసమారాధన నిర్వహించారు. తారువలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు స్వామివారిని దర్శించుకున్నారు. రామాలయాల్లో సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కె.కోటపాడు, చౌడువాడ, మేడిచర్ల రామాలయాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం సీతారాముల ఉత్సవమూర్తులను ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు బత్తి వెంకటరమణ, డోకల లక్ష్మీ నరసింహమూర్తి, దాడి ఎరుకునాయుడు, పూడి నారాయణమూర్తి, పూడి శ్రీను, జూరెడ్డి రాము, బత్తి శ్రీను, కుంచా అంజిబాబు, పైలా గోపి, పైలా నారాయణమూర్తి, చిరంజీవి, సంతోశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



రావికమతం: దొండపూడిలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

డప్పుల పోటీల విజేత చీడికాడ

మాడుగుల రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి డప్పు కళాకారుల పోటీల్లో చీడికాడ ప్రథమ స్థానంలో నిలిచింది. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఒమ్మలి గ్రామంలో ఈ పోటీలు నిర్వహించారు. చీడికాడకు చెందిన కడితి సోంబాబు విజేతగా నిలిచారు. చెవ్వేటి అప్పారావు (సత్యవరం), రాచర్ల సూరిబాబు (ఒమ్మలి) తర్వాత స్థానాల్లో నిలిచారు. పోటీల నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందించారు. నిర్వాహకులు మోర్తా శ్రీనివాసు, ఏలుసూరి గాటీలు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని నిరసన



నిరసన తెలుపుతున్న డొంకాడ గ్రామస్థులు, విద్యార్థులు

గొలుగొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): డొంకాడ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు, విద్యార్థులు మోకాళ్ల నిల్చొని ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కొత్తఎల్లవరం గ్రామ పంచాయతీలో శివారు డొంకాడ గ్రామంలో సుమారు 180 మంది పీటీజీలు నివసిస్తున్నామని, గ్రామానికి రాకపోకలు సాగించాలంటే నరకయాతన పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై పలుమార్లు అధికారులు, పాలకులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు నిర్మానానికి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు మర్రి పోతురాజు, సత్తిబాబు, తదితరులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మాడుగుల/కె.కోటపాడు/రావికమతం/బుచ్చెయ్యపేట/రోలుగుంట/నాతవరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజవకార్గల పరిధిలోని పలు మండలాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా మండలాల అధ్యక్షులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పనితీరును నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల, కె.కోటపాడు, రావికమతం, బుచ్చెయ్యపేట, రోలుగుంట, నాతవరం మండలాల బీజేపీ నాయకులు మెలిపాక మణికంఠ, ఎంఎస్.సుబ్బలక్ష్మి, ఎం.వాసు, కె.వెంకటేశ్వర్లు, శ్రీనాథ ప్రసాదరావు, పుట్టా నానాజీ, అప్పాన సత్యం, సన్ని గంగాధర్, దొగ్గ ఈశ్వరప్రసాద్, సుందరపు గంగాధర్, కొమార అప్పారావు, లాలం శ్రీనివాసరావు, సబ్బవరపు శివ, బండారు శ్రీనివాసరావు, రొంగలి మహేశ్ రొంగలి శ్రీనివాసరావు, రాళ్లపల్లి శ్రీరామ్మూర్తి, ఇమంది సన్యాసిరావు, శరగడం సన్యాసినాయుడు, కె.రమణమూర్తి, సీతా వెంకటరమణ, దొండా నానాజీ, దూది రాజేష్, చినవెంకయ్యదొర, అయ్యన్నదొర, మణికంఠ, ఈశ్వరరావు, గుటాల చిన్న, మడగల ఫాల్గుణ, పచ్చిగొళ్ల ఈశ్వరరావు, సబ్బవరపు పెద్దినాయుడు, సబి కుమారస్వామి, గవిరెడ్డి త్రినాథ్, వేముల సూర్యనారాయణ, బొడ్డు రజనీ, పేరూరి బుల్లిదొర, ఎల్.విక్రమ్, గొంప సత్యనారాయణ వానపల్లి భవానీరుషీ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం



భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు